క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అవగాహన



తనకల్లులో బ్లీచింగ్‌పౌడర్ చల్లుతున్న దృశ్యం

తనకల్లు: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల వైద్యాధికారులు లోకేశ్వర్‌రెడ్డి, ధర్మరాజు అన్నారు. స్థానిక బూడిదగడ్డ వీధి, హరిజనవాడ, ఇందిరా నగర్, బ్యాంక్ స్ట్రీట్‌లలో మంగళవారం సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. దోమ లార్వా వృద్ధి చెందకుండా చూసుకోవాలన్నారు. ఇల్లు, చుట్టుపక్కల నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమల కాటుకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం రెండు బృందాలుగా ఏర్పడి ఆయా వీధుల్లో పేరుకుపోయిన మురుగునీటిపై బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సూర్యనారాయణరెడ్డి, సీహెచ్‌ఓ నాగమల్లిక, ఏఎన్‌ఎం అనురాధ, హెల్త్ అసిస్టెంట్లు మోహన్‌రెడ్డి, ముసల్‌రెడ్డి, సుబ్రమ్మణ్యం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదాయంతో పాటు ఆరోగ్యం



చిరుధాన్యాల సాగును పరిశీలిస్తున్న ఏడీఏ సనావుల్లా, ఏఓ శ్రీనివాసరెడ్డి

కదిరి అర్బన్: చిరుధాన్యాల సాగు ఆదాయంతో పాటు ఆరోగ్యాన్ని ఇస్తుందని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సనావుల్లా పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కె.బత్తలపల్లి, చిన్నయ్యగారిపల్లిలో రైతులు సాగు చేస్తున్న చిరుధాన్యాల పంటలను వారు ఏఓ శ్రీనివాసరెడ్డితో కలసి పరిశీలించారు. పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ కావాలంటే చిరుధాన్యాల సాగు చేయాలని రైతులకు సూచించారు. అనంతరం రఘునాథరెడ్డి సాగు చేస్తున్న కొర్ర పంట, శాంతమ్మ సాగు చేసిన సజ్జ పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

'సుప్రీం' తీర్పు కోసం ఎదురుచూపు

కదిరి అర్బన్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు కోసం జాతి యావత్తు ఎదురు చూస్తోందని మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నేత నాగేంద్రనాథ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన డిగ్రీ విద్యార్థుల వసతిగృహంలో జాతిని జాగృతం చేసే కార్యక్రమం నిర్వహించారు. మన ఆత్మగౌరవానికి ప్రతీకగా ప్రతి గ్రామంలో దండోరా జెండా ఎగురవేయాలన్నారు.

నైతిక విలువలు నేర్పించాలి

బత్తలపల్లి: విద్యార్థి దశ నుంచే నైతిక విలువలను నేర్పించాలని బత్తలపల్లి ఎస్ఐ పి.శ్రీనివాసులు సూచించారు. మంగళవారం మాల్యవంతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు పఠనా నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు పంచతంత్రం, బాలమిత్ర తదితర విజ్ఞానదాయకమైన పుస్తకాలను చదవాలని సూచించారు. అమ్మాయిలను ఈవ్‌టీజింగ్ చేస్తే ఇబ్బంది పాలవుతారని హెచ్చరించారు. అనంతరం మహిళా పోలీసులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరించారు.

ఎస్పీని కలిసిన సబ్ కలెక్టర్



ఎస్పీకి మొక్కను అందజేస్తున్న సబ్ కలెక్టర్

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రత్నను పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్కను అందజేశారు. అనంతరం శాంతిభద్రతలపై కాసేపు చర్చించారు.

ఘనంగా మహనీయుల జయంతి

పుట్టపర్తి టౌన్: యువతలో స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి నింపిన మహనీయులు బాలగంగాధర్ తిలక్, ఆజాద్‌ల జయంతిని బీజేపీ నాయకులు మంగళవారం పుట్టపర్తిలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జ్యోతి ప్రసాద్, హరికృష్ణ, కొండమరాజు, బాలగంగాధర్, సోకే రామాంజనేయులు, నారాయణ స్వామి, వెంటేటేష్ శివశంకర్‌రెడి పాల్గొన్నారు.

బడ్జెట్‌పై అవగాహన

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆర్థిక శాస్త్ర ఉపన్యాసకులు చిట్టెమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు బడ్జెట్‌పై అవగాహన కల్పించారు.

జూదరుల అరెస్ట్

కదిరి టౌన్: పట్టణంలోని వాల్మీకి పాఠశాల వెనుక జూదం ఆడుతున్న విష్ణు, హైదర్ సహా ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ బాబ్జాన్ మంగళవారం రాత్రి తెలిపారు. వీరి నుంచి రూ.12,310 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

సమస్యల ప్రాంగణం

- రిపేరీలోనే ఆర్‌ఓ వాటర్ ప్లాంట్
- దాహం తీరాలంటే వాటర్ కొనాల్సిందే
- మూత్రవిసర్జన కంపుతో అదురుతున్న ముక్కు పుటాలు

కదిరి అర్బన్: ఆర్టీసీ బస్సు ప్రయాణికుల ప్రాంగణం సమస్యలకు నిలయంగా మారింది. ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమే.. కానీ బస్టాండ్‌లో వేచి ఉండి బస్సులు ఎక్కాలంటే ప్రయాణికులకు అరక్షితమే. కదిరి డిపో పరిధిలో 110 బస్సు సర్వీసులు ఉన్నాయి. వేలాదిమంది ప్రయాణికులు ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఓ దాత ఆర్‌ఓ ప్లాంట్ వితరణ చేశారు. ప్రారంభంలో ఆర్‌ఓ ప్లాంట్ నీరు ఎంతోమంది దాహం తీర్చింది. తర్వాతి కాలంలో ప్లాంట్ తరచూ రిపేరీ వస్తోంది. దీంతో ప్రయాణికులు డబ్బు పెట్టి వాటర్ బాటిళ్లు కొంటున్నారు. ఇక్కడి దుకాణాదారులు తమ వ్యాపారం కోసం ఆర్‌ఓ ప్లాంట్ పనిచేయకుండా ఉండేలా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్లాంట్ రిపేరీ ఉన్న సమయంలో వాటర్ బాటిళ్ల విక్రయాలు ఊపందుకుంటాయి.

- ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికుల కోసం బస్టాండ్‌లోని మూత్ర విసర్జనశాల సరైన నిర్వహణ లేక అధ్వానంగా మారింది. నీటి సౌకర్యం సరిగా లేకపోవడంతో శుభ్రత ఉండటం లేదు. దీంతో మూత్రవిసర్జన కంపు కొడుతోంది. అంతే కాదు మూత్రము సక్రమంగా వెళ్లక బయటకు వస్తోంది. దీంతో అక్కడ నడవడానికి కూడా వీలుకాకుండా ఉంది. ఆ ప్రాంతంలోకి రాగానే భరించలేనంత దుర్గంధం వస్తోంది.



కదిరి ఆర్టీసీ బస్టాండ్ ముఖ ద్వారం



మరమ్మతుకు గురైన ఆర్వో వాటర్ ప్లాంట్



మూత్రవిసర్జన శాల నుంచి బయటకు వస్తున్న నీరు

వాటర్ ప్లాంట్ రిపేరీ చేయించాలి

పేదల కోసం దాతలు ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను వెంటనే మరమ్మతులు చేయాలి. వాటర్ బాటిల్ కొనుక్కుని తాగే స్తోమత చాలా మందికి ఉండదు. ఆర్వో వాటర్ ప్లాంట్ తరచూ మరమ్మతులకు గురికాకుండా చూడాలి. బయట రూ.25 చెల్లిస్తే కానీ వాటర్ బాటిల్ రాదు. ఇలాంటి తరుణంలో దాతలు ఇచ్చిన వాటర్ ప్లాంట్‌ను వినియోగించుకోవాలి.

– అనిల్, ప్రయాణికుడు, కదిరి

సమస్యలు పరిష్కరిస్తాం



బస్టాండ్‌లో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ నెలకొకసారి పనిచేయకుండా పోతోంది. రిపేరీకి రూ.4వేల దాకా ఖర్చవుతోంది. డిపో నుంచి ఎలాంటి నిధులూ రావు. ప్రతి నెలా రిపేరీ చేయించాలంటే నిధులు ఎక్కడినుంచి తేవాలి? మూత్రవిసర్జన శాల నిర్వహణను మెరుగుపరుస్తాం. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. – మైనొద్దీన్, ఆర్టీసీ డీఎం

ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్సే చేయాలి

- డాక్టర్ అని పెట్టుకోవద్దు
- అత్యవసర సేవలు అందించరాదు
- వచ్చీరాని వైద్యంతో అనర్థాలు తేవొద్దు
- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగేంద్రనాయక్ ఆదేశం

కదిరి టౌన్: ఆర్‌ఎంపీలు తమ వద్దకు వచ్చే రోగులకు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగేంద్రనాయక్ ఆదేశించారు. ఆర్‌ఎంపీల సంఘం నాయకుడు అల్లాబకాష్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఎన్జీవో హోమ్‌లో ఆర్‌ఎంపీలకు శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్రనాయక్, డిప్యూటీ డెమో ఆఫీసర్ బాబా ఫక్రొద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఆర్‌ఎంపీలు చేయాల్సినవి, చేయకూడని సేవల గురించి వివరించారు. క్లినిక్‌లకు ప్రథమ చికిత్స కేంద్రాలు అని, డాక్టర్ అని కాకుండా ఆర్‌ఎంపీ అని మాత్రమే బోర్డులు పెట్టుకోవాలని స్పష్టం చేశారు. ప్రథమ చికిత్స కేంద్రాల్లో అడ్మిషన్లు, సెలైన్ స్టాండ్లు, బెడ్లు, మంచాలు ఉంచరాదన్నారు. ఇంజెక్షన్లు వేయరాదని, ప్రసవాలు, అబార్షన్లు చేయరాదని, అత్యవసర సేవలు అందించరాదని సూచించారు. యాంటీబయాటిక్‌లు అనవసరంగా ఇవ్వరాదని, ల్యాబ్ పరీక్షలు చేయరాదన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులకు మాత్రమే రెఫర్ చేయాలని సూచించారు. ఆర్‌ఎంపీలు వచ్చీరాని వైద్యం చేసి.. ఏమైనా అనర్థాలకు కారకులైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొక్కంటి క్రాస్‌లో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు మోనా, సీహెచ్‌ఓ అశ్వత్థకుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ విజయ్‌కుమార్, సూపర్‌వైజర్ బాషా,వైద్య సిబ్బంది, ఆర్‌ఎంపీలు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



ప్రశాంత్



విష్ణుప్రియ

అమడగూరు: మహమ్మదాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన తనకంటిపల్లికి చెందిన విద్యార్థులు ప్రశాంత్ (582 మార్కులు), విష్ణుప్రియ (576 మార్కులు) ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఈ విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థులకు బడ్జెట్‌పై అవగాహన

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆర్థిక శాస్త్ర ఉపన్యాసకులు చిట్టెమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు బడ్జెట్‌పై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై విద్యార్థులకు ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, చూపించారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయించిన నిధులు, బడ్జెట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు త్రివేణి, షమీవుల్లా, గోపాల్‌నాయక్, కిరణ్‌కుమార్, భువనేశ్వరి, మీనా, పుష్పావతి, సరస్వతి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సుందరయ్యనగర్ శ్రీ గణేష్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో 400 మంది విద్యార్థులకు మంగళవారం మడకం చౌడయ్య జ్ఞాపకార్థం కుమారుడు మడకం చందు రూ.50 వేలు విలువైన విద్యా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజేశ్వరి, హెచ్‌ఎం షర్ఫుద్దీన్ చేతులమీదుగా విద్యార్థులకు ఒక్కొక్కరికి ఆరు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, క్రయన్స్, పలకలను అందించారు.

గ్రంథాలయం వినియోగించుకోండి



తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

కొత్తచెరువు: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని పాఠకులు వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. మంగళవారం ఆయన గ్రంథాలయాన్ని సందర్శించారు. అక్కడ అందుబాటులో ఉన్న పుస్తకాలను పరిశీలించారు. పాఠకులు ఎంతమంది వస్తున్నారు.. దిన పత్రికలు, పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయా అని గ్రంథాలయాధికారి జయరామ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విజయనగర్ కాలనీలో రెవెన్యూ అధికారులతో కలిసి పర్యటించి ప్రజలకు శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కళావతి, డీటీ స్వాతి, ఎంఈఓ జయచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు చేయూత

ధర్మవరం అర్బన్: బాస్కెట్‌బాల్ క్రీడాకారులకు స్పెయిన్ బృందం చేయూతనందించినట్లు ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. ధర్మవరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం స్పెయిన్ దేశానికి చెందిన ఈగల్ బాస్కెట్‌బాల్ క్లబ్ కోచ్‌లు మౌర్, ఒరియోల్, నటాలియా, పోల్‌లు బాస్కెట్‌బాల్ క్రీడాకారులకు ఉచితంగా స్పోర్ట్స్ డ్రెస్, షూస్, బాస్కెట్‌బాల్స్ అందించారు. ఈ సందర్భంగా ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ అవకాశాలను అందిపుచ్చుకుని అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వాయల్పాడ్ హిదయ్‌తుల్లా, కోచ్ సంజయ్, ఆత్మీయ ట్రస్ట్ సభ్యులు జస్వంత్, హరిజిత్ ప్రణవ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

శిశు ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోండి

కొత్తచెరువు: ప్రభుత్వం ప్రవేశపెట్టిన శిశు ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్ప తెలిపారు. ఆమె మంగళవారం కొత్తచెరువు– 2, 3 అంగన్‌వాడీ సెంటర్లలో పుట్టిన పిల్లలకు ఉచితంగా ఆధార్‌కార్డులు పొందేందుకు శిశు ఆధార్ సేవలను చరిత కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) వారితో కలిసి నమోదు చేయించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి 27 వరకు ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరం ద్వారా ఉచితంగా పిల్లలకు ఆధార్ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 95338 77556లో సంప్రదించాలని సూచించారు.

ఆధార్ సెంటర్ పరిశీలన

ముదిగుబ్బ: సానేవారిపల్లి సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు సేవలను మంగళవారం ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి పరిశీలించారు. అలాగే మలకవేమల ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు.

కరెంటు కోతలపై కన్నెర్ర

కొత్తచెరువు: మండల కేంద్రంలోని పాత ఆంధ్రాబ్యాంకు వెనుక, బీసీ కాలనీలో రెండు నెలలుగా గృహ విద్యుత్ సరఫరాలో కోతలు విధిస్తున్నారు. ఓల్టేజీ సమస్య కారణంగా ఎలక్ట్రానిక్ వస్తువులు పేలుతున్నాయి. అధికారులకు తెలిపినా పట్టించుకోకపోవడంతో ఆయా ప్రాంత ప్రజలు మంగళవారం విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. విద్యుత్ సర్వీసులకు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడంతో తరచూ లో ఓల్టేజీ–హై ఓల్టేజీ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ఉన్నట్టుండి ఇళ్లలోని టీవీలు, ఫ్రిడ్జ్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు పేలుతున్నాయని తెలిపారు. అరకొర సంపాదనతో బతుకు వెళ్లదీసే వాళ్లం.. ఎలక్ట్రానిక్ వస్తువులు మళ్లీ మళ్లీ కొనే శక్తి లేదని తెలిపారు. దీనికితోడు కరెంటు కోతల కారణంగా రాత్రి పూట దోమల బెడదను భరించలేకపోతున్నామని చెప్పారు. ఏఈ వెంకటేష్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లినా ఆయన తనకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా మెరుగుపరచాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న ఏడీ శర్వన్ పుట్టపర్తి నుంచి హుటాహుటిన వచ్చి రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో కొత్తచెరువు ఉప సర్పంచ్ యుగంధర్, స్థానికులు ఆవుల అశోక్, మారుతి, సాయి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ప్రజలు

శాకాంబరీదేవిగా వాసవీమాత

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేపీటీ వీధిలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం శ్రీ వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో అమ్మవారిని శాకాంబరిదేవిగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు.

ఊరించి.. ఉసూరుమనిపించి !

- జూలై దాటిపోతున్నా చినుకుజాడ కరువు
- బీళ్లుగా మారుతున్న భూములు
- ప్రశ్నార్థకంగా ఖరీఫ్ పంటల సాగు

కనగానపల్లి: జూలై నెల దాటిపోతున్నా వర్షం జాడ కానరాకపోవటంతో అన్నదాతల ఆశలు ఆవిరవుతున్నాయి. ఆకాశంలో మేఘాలు ఊరిస్తున్నా.. ఆషాఢం గాలుల దెబ్బకు చినుకు కూడా రాలటం లేదు. దీంతో ఖరీఫ్ పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే రాప్తాడు నియోజక వర్గంలో వేలాది ఎకరాల భూములను బీళ్లుగా కనిపిస్తున్నాయి.

నేలరాలని చినుకు..

జూన్ నెల నుంచే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వర్షాలు సకాలంలో కురిస్తే జూన్ 15 నుంచి జూలై 15 తేదీ లోపల రైతులు పంటలు సాగు చేసేవారు. అయితే ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో ఒకటి, రెండు వర్షాలు పడినా తిరిగి వర్షం జాడ లేకపోవడంతో రైతులు డీలా పడ్డారు. ఆకాశంలో మేఘాలు ఊరిస్తున్నా వరుణదేవుడు మాత్రం కనికరించడం లేదు. దీనికి తోడు ఆషాడం గాలులు విపరీతంగా వీస్తుండటంతో వర్షం కురవటం లేదు. నియోజక వర్గ వ్యాప్తంగా జూన్ 15 నుంచి ఇప్పటికి వరకూ ఒక్క పదునైన వర్షం కూడా పడలేదని రైతులు వాపోతున్నారు. మరో వారం రోజులు వర్షం రాకపోతే పంటలు సాగు చేయటం కష్టమేనని కర్షకులు చెబుతున్నారు.

ఖరీఫ్ పంటల సాగు ప్రశ్నార్థకం

రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రతి ఖరీఫ్‌లోనే సుమారు 85 వేల హెక్టార్లలో పంటలు సాగు చేస్తుంటారు. ఇందులో వర్షాధారం కింద మెట్ట భూములలో 70 వేల హెక్టార్లలో వేరుశనగ పంట సాగు చేస్తారు. అయితే ఈ ఖరీఫ్‌లో ఇప్పటి దాకా 10 వేల హెక్టార్లలో కూడా రైతులు పంటలు సాగు చేయలేదు. బోరుబావుల కింద తప్ప మెట్ట భూముల్లో రైతులు ఎక్కడా పంటలు సాగుచేయకపోవటంతో సాగు భూములన్నీ బీళ్లుగా కనిపిస్తున్నాయి. ఈ నెలాఖరులోగానైనా వర్షం కురిస్తే కొన్ని ప్రత్యామ్నాయ పంటలైనా రైతులు సాగు చేసుకొనే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.



ఆకాశంలో ఊరిస్తున్న మేఘాలు

బీళ్లుగా పెట్టుకున్నాం



ఖరీఫ్ పంటల సాగుకు నేలలు దుక్కి చేసుకోవటంతో పాటు విత్తనాలు, ఎరువులు అన్ని సిద్ధం చేసుకొని పెట్టుకున్నాం. కానీ ఏం లాభం? ఇంతవరకూ నేల చినుకు రాలటం లేదు. దీంతో సాగు భూములన్నీ బీళ్లుగా మారాయి. ఇప్పటికైనా వరుణుడు కరుణిస్తే కొంత మేరనైనా పంటలు సాగు చేసుకుంటాం

– వెంకటరామిరెడ్డి, పర్వతదేవరపల్లి, కనగానపల్లి మండలం

నెలాఖరుదాకా పంటలేసుకోవచ్చు

వర్షం కురిస్తే ఈ నెలాఖరు దాకా మెట్ట భూముల్లో వేరుశనగ పంట సాగు చేసుకోవచ్చు. కంది, ఆముదం, పెసర వంటి ఇతర పంటలు ఆగస్టు నెలాఖరు వరకూ సాగు చేసుకోవచ్చు. అయితే పంట దిగుబడులు బాగా రావాలంటే సకాలంలో పంటలు సాగు చేసుకోవటం మంచిది.

– కృష్ణయ్య, వ్యవసాయశాఖ ఏడీఏ, ధర్మవరం డివిజన్

భక్తిశ్రద్ధలతో జలధికి పీర్లు

పుట్టపర్తి టౌన్/ పుట్టపర్తి/ అమడగూరు/ ధర్మవరం రూరల్/ బత్తలపల్లి: పల్లె, పట్టణం తేడా లేకుండా అంతటా మొహర్రం పండుగను ఘనంగా జరుపుకొంటున్నారు. త్యాగానికి ప్రతీకగా హిందూ, ముస్లింలు సమైక్యంగా వేడుకల్లో పాల్గొంటున్నారు. పుట్టపర్తిలోని రెండోవార్డు పెద్ద బజార్, 15 వార్డు బ్రాహ్మణపల్లిలో మంగళవారం ఉదయమే గుండం వద్ద పొట్టేళ్లు బలిచ్చారు. సాయంత్రం ప్రజలు ఉత్సాహంగా అలావు తొక్కారు. చావిడి ముందు అగ్ని గుండం చుట్టూ పీర్ల స్వాములను ప్రదక్షిణలు చేయించి అగ్ని ప్రవేశం చేయించారు. అనంతరం అగ్ని గుండం పూడ్చివేసి చిత్రావతి నదిలోకి పీర్లను జలధికి తరలించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ కొండారెడ్డి బందోబస్తు పర్యవేక్షించారు.

- బుక్కపట్నం మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం పీర్లు జలధికి వెళ్లాయి. బుక్కపట్నంలో పీర్ల ఊరేగింపు ఘనంగా జరిగింది.
- అమడగూరులో మంగళవారం పీర్ల జలధి నిర్వహించారు. తెల్లవారుజామున మూడు గంటలకే అగ్నిగుండ ప్రవేశం ఏర్పాటు చేశారు. యువకులు, మహిళలు తడి దుస్తులతో వచ్చి అగ్ని గుండంలో నడుచుకుంటూ వెళ్లారు.
- ధర్మవరం మండలం తిప్పేపల్లిలో భక్తి శ్రద్ధలతో మొహర్రం వేడుకలు జరిగాయి. పెద్దకాశీం, చిన్నకాశీం, ఉజ్జినప్ప స్వాములను ప్రత్యేకంగా అలంకరించి చక్కెర చదివింపులు చేశారు. అనంతరం పీర్లను జలధికి తీసుకెళ్లారు.
- బత్తలపల్లి మండలం అప్పరాచెరువుతో పాటు సంగాల, దంపెట్ల, నల్లబోయనపల్లి, ముద్దనపల్లి గ్రామాల్లో మంగళవారం పీర్లస్వాములను ఏటికి తరలించారు. ఎస్ఐ శ్రీనివాసులుతో పాటు పలువురు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో గ్రామస్తులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.



బుక్కపట్నంలో ఊరేగుతున్న పీర్లు

రైతుసేవా అధికారులతో సమీక్ష



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకుడు సత్యనారాయణ

ఓడీచెరువు : మండలంలోని రైతుసేవా కేంద్రం అధికారులతో కదిరి సహాయ వ్యవసాయ సంచాలకుడు సత్యనారాయణ మంగళవారం సమీక్ష నిర్వహించారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీ, మట్టి నమూనాలు సేకరించి సాయిల్ టెస్టింగ్‌కు పంపించడం, రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు పీఎం కిసాన్ ఫిజికల్ వెరిఫికేషన్ త్వరగా పూర్తి చేయడంపై ఆదేశాలు జారీ చేశారు. శేషయ్యగారిపల్లి తండాలోని భాస్కర్ నాయక్ పొలం పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఇలియాజ్ పాల్గొన్నారు.

రైల్వే పాసుల అందజేత



దివ్యాంగులకు రైల్వేపాసులందజేస్తున్న ఆర్డీఓ

కదిరి అర్బన్: దివ్యాంగులకు రైల్వే శాఖ మంజూరు చేసిన రైల్వే పాసులను మంగళవారం ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణ అందజేశారు. కదిరి నియోజకవర్గంలోని 191 మంది దివ్యాంగులకు 70 శాతం రాయితీ రైల్వే పాసులు మంజూరయ్యాయన్నారు.

సీఐటీయూ మండల కమిటీ ఎన్నిక

అమడగూరు: సీఐటీయూ అమడగూరు మండల కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఎస్సీ హాస్టల్ ఆవరణలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఓడీచెరువు మండల కన్వీనర్ కుల్లాయప్ప ఆధ్వర్యంలో మండల కన్వీనర్‌గా కేశవ, కో కన్వీనర్‌గా బాషా, కోశాధికారిగా బావయ్య, వేణును ఎన్నుకున్నారు.

దుర్గమ్మకు బోనాలు

ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణంలోని పలు వార్డులలో మంగళవారం దుర్గమ్మకు బోనాలు సమర్పించారు. మహిళలు తలపై బోనాలను పెట్టుకుని పురవీధుల్లో డప్పుల వాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దుర్గానగర్‌లోని ప్రజలు పెద్దమ్మ దేవతకు, దుర్గమ్మ దేవతతో పాటు పోతలయ్యస్వామికి బోనాలు సమర్పించారు. మారుతినగర్, రాజేంద్రనగర్, యాదవ వీధి తదితర వార్డుల నుంచి మహిళలు పెద్ద ఎత్తున బోనాలెత్తారు. కోటగడ్డ పెద్దమ్మ తల్లికి పూజారి రాంప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలు సమర్పించారు.

పెద్దమ్మ తల్లీ.. కరుణించమ్మా!

బత్తలపల్లి: మండల కేంద్రమైన బత్తలపల్లిలోని వడ్డెర కాలనీలో పెద్దమ్మ తల్లికి మంగళవారం బోనాలు సమర్పించారు. పెద్దమ్మ తల్లిని అర్చకులు పూలతోనూ, ఆభరణాలతోనూ అందంగా అలంకరించారు. అనంతరం కొత్త కుండలో చేసిన తీపి అన్నం, నారికేళాలు, పూలను తీసుకుని ఊరేగింపుగా దేవాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ పూజల అనంతరం మూగజీవాలను గ్రామదేవతకు బలిచ్చారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

నల్లచెరువు: ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నరేంద్రనాయక్ అన్నారు. మంగళవారం రాజమోళ్లపల్లిలో సీజనల్ వ్యాధులపై ఆయన అవగాహన కల్పించారు. డాక్టర్ కల్పనరెడ్డి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాణెమ్మ, సీహెచ్‌ఓ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి: పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని ఈఓఆర్డీ అనీల్ కుమార్ తెలిపారు. మంగళవారం కనగానపల్లి సచివాలయంలో సర్పంచ్ అంకె పరిమళ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోతలయ్యస్వామికి బోనాలు



బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

కనగానపల్లి: వేపకుంటలో మంగళవారం పోతలయ్యస్వామి బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. భక్తులు ప్రదర్శనగా వెళ్లి బోనాలు సమర్పించారు. అనంతరం పోతలయ్యస్వామికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.